


జాతీయ బీచ్ కబడ్డీ పోటీలకు ఇద్దరు ఎంపిక

ప్రజాశకి-విజయనగరం టౌన్


భావన


సూర్యకళ

ఈనెల 2 నుంచి 4 వరకు నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలలో ప్రతిభ కనబరిచిన జిల్లా క్రీడాకారులు ఎం.భువన, వి.సూర్యకళ జాతీయ స్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 9 నుండి 12 వరకు బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయలో జరగబోయే జాతీయ పోటీలకు ఎం.భువన ఆంధ్ర జట్టు కెప్టెన్‌గా, సూర్యకళ జట్టు సభ్యులుగా ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రంగారావు దొర కె.వి.ప్రభావతి ,ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు, ట్రెజరర్ ఈశ్వరరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మండల, డివిజన్ స్థాయిలో గ్రీవెన్స్

- తహశీల్దార్ కార్యాలయాలకు వాచ్‌మెన్లు, సిసి కెమెరాలు
- ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలి
- రెవెన్యూ అధికారుల సమావేశంలో కలెక్టర్ అంబేద్కర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఇకనుంచి అన్ని తాహశీల్దార్ కార్యాలయాల్లో, రెవెన్యూ డివిజన్ స్థాయిలో గ్రీవెన్స్ నిర్వహించి, ప్రజలనుంచి వినతులను స్వీకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. వచ్చిన వినతులను వెంటవెంటనే పరిశీలించి, నిర్ణీత గడువులోపల వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని సూచించారు. పరిష్కరించలేని వాటిని, అందుకు కారణాలను సవివరంగా ఫిర్యాదుదారునికి తెలియజేయాలని కలెక్టర్ సూచించారు.

ఆర్‌డిఒలు, తాహశీల్దార్లు తదితర రెవెన్యూ అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంబేద్కర్ బుధవారం సమావేశం నిర్వహించారు. జిల్లాలోని రెవెన్యూశాఖలో ఉద్యోగుల సంఖ్య, ఖాళీలు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, అస్సైన్‌మెంట్ భూములు, 22-ఎ, హౌస్ సైట్స్, ఎలినేషన్, వెబ్‌ల్యాండ్ మ్యుటేషన్స్, ల్యాండ్ కన్వర్షన్, కౌలు గుర్తింపు కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, రేషన్ డిపోలు, కుల వివాదాలు, రెవెన్యూ రికవరీ యాక్ట్, నీటిపన్ను వసూలు, వివిధ కోర్టుల్లో పెండింగ్ కేసులు, రెవెన్యూ భవనాల స్థితిగతులు, ఇసుక విక్రయాలు, ఇనాం భూముల వివాదాలు తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్‌తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఆయా విషయాలకు సంబంధించిన అంశాలను డిఆర్‌ఒ ఎస్‌డి అనిత పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రీవెన్స్‌కు వస్తున్న వినతుల్లో రెవెన్యూకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయని అన్నారు. తాహశీల్దార్లు, ఆర్‌డిఒలు క్రియాశీలంగా వ్యవహరించి, తమ స్థాయిలోనే వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని సూచించారు. దీనికోసం తమ కార్యాలయాల్లో గ్రీవెన్స్ నిర్వహించాలని ఆదేశించారు. నిబంధనలకు లోబడి, చట్ట ప్రకారం వాటిని నిర్ణీత గడువులోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని, లేని పక్షంలో వివరంగా, స్పష్టంగా ఫిర్యాదు దారునికి తెలియజేయాలని సూచించారు. వచ్చిన ఫిర్యాదుపై ఏదో ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణం కోసం ఇప్పటివరకు సేకరించిన భూముల వివరాలు, రూపొందించిన లేఅవుట్లు, పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలు, ఖాళీగా ఉన్న స్థలాల వివరాలను 15 రోజుల్లోగా ఆర్‌డిఒల ద్వారా తమకు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ల్యాండ్ కన్వర్షన్‌కు సంబంధించి 820 కేసుల్లో సుమారు రూ.5.29కోట్లు బకాయి ఉందని, వారికి వెంటనే నోటీసులు ఇవ్వాలని, స్పందికపోతే ఆర్‌ఆర్ యాక్ట్‌ను ప్రయోగించాలని సూచించారు. తాహశీల్దార్, ఆర్‌డిఒ కార్యాలయాలకు వెంటనే సిసి కెమేరాలు ఏర్పాటు చేయాలని, వాచ్‌మెన్లను నియమించాలని ఆదేశించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ శతశాతం పూర్తి చేయాలని తాహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. రేషన్ డీలర్లకు సంబంధించి, త్వరలో ప్రభుత్వం నుంచి ఆదేశాలు రానున్నాయని, వాటి ప్రకారం ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటిపన్ను వసూలుకు సంబంధించి పూర్తి వివరాలను అందజేయాలన్నారు. లోక్ అథాలత్, వివిధ కోర్డుల్లో, వివిధ స్థాయిల్లో పెండింగ్ కేసుల వివరాలను పది రోజుల్లోగా తమకు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పనిచేయాలని, క్షేత్రస్థాయిలో పర్యటించాలని కలెక్టర్ అంబేద్కర్ సూచించారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, కెఆర్‌ఆర్‌సి ఎస్‌డిసి సుమబాల, డిఎస్‌ఒ మధుసూదనరావు, సివిల్ సప్లయిస్ డిఎం మీనాకుమారి, ఆర్‌డిఒలు ఎంవి సూర్యకళ, ఎ.సాయిశ్రీ, బి.శాంతి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో అట్రాసిటీ కేసుల దర్యాప్తు

- ఎస్‌పి వకుల్ జిందాల్
- బాధితులకు సకాలంలో పరిహారం అందేందుకు ప్రతిపాదనలు


ఫైళ్లను పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-విజయనగరం కోట

అట్రాసిటీ కేసుల దర్యాప్తును సకాలంలో పూర్తి చేయాలని ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. బుధవారం జిల్లాపోలీసు కార్యాలయంలో డిఎస్‌పి స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి సబ్ డివిజను పరిధిలో నమోదై, దర్యాప్తులో ఉన్న అట్రాసిటీ కేసులను సమీక్షించి, ఆయా కేసుల్లో ఇంత వరకు జరిగిన దర్యాప్తు తీరును పరిశీలించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల్లో చట్ట ప్రకారం వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. అట్రాసిటీ కేసుల్లో ఫిర్యాదు అందిన వెంటనే పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యేలా సంబంధిత డిఎస్‌పిలు పర్యవేక్షించాలన్నారు. కేసుల దర్యాప్తును 60 రోజుల్లో పూర్తి చేసి, నిందితులపై అభియోగ పత్రాలను న్యాయ స్థానాల్లో దాఖలు చేయాలన్నారు. అభియోగ పత్రాల తయారు చేయడంలో న్యాయ నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు పరిహారం సకాలంలో అందేందుకు ఎప్పటికప్పుడు ప్రతిపాదనలను సిద్ధం చేసి, కలెక్టరు ఆఫీసుకు పంపాలని, సకాలంలో బాధితులకు పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో బొబ్బిలి డిఎస్‌పి పి.శ్రీనివాసరావు, చీపురుపల్లి డిఎస్‌పి ఎ.ఎస్.చక్రవర్తి, డిటిసి డిఎస్‌పి ఎం.వీరకుమార్, ఎస్సై లు గణేష్, మురళీ, పాల్గొన్నారు.

విద్యార్థులకు సామాజిక స్పృహ ఉండాలి

ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సుద్దాల అశోక్ తేజ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతీ విద్యార్థి తమ చదువుతో పాటు సమాజంపై స్పృహ కలిగి తమ జీవితాన్ని ఉన్నతంగా మలచుకోవాలని సుప్రసిద్ధ గేయ రచయిత, కవి, గాయకుడు సుద్దాల అశోక్ తేజ పిలుపునిచ్చారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో బుధవారం 'మంచి ఆలోచనలు - సృజనాత్మకత - మూర్తిమత్వ వికాసం' అనే అంశం పై జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కట్టిమని అశోక్ తేజతో కలిసి జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతతరం అశోక్ తేజ మాట్లాడుతూ కష్టం వెనకే సుఖం, బాధ తరువాత ఆనందం, సహనం తోనే విజయం చేకూరుతాయని అన్నారు. అత్యంత వెనుకబడిన స్థాయి నుంచి అత్యుత్తమ స్థాయికి ఎదిగినప్పుడే మీ జీవితానికి సార్థకత అని విద్యార్థులకు ఉద్బోధించారు. అనంతరం తన బాణీ పాటలతో విద్యార్థులను ఉర్రూతలూగించారు. అనంతరం విసి కట్టిమని మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం లో చదువుతో పాటుగా ఆటలు, పాటలు, లలిత కళలు, చిత్రలేఖనం, సాహిత్యం, జాతీయత, సంస్కృతి, సాంప్రదాయాలు మొదలైనవి కూడా ఉండాలని అన్నారు. కార్యక్రమానికి యూనివర్సిటీ పరిపాలనాధికారి డాక్టర్ ఎన్ వి ఎస్ సూర్యనారాయణ అనుసంధాన కర్తగా వ్యవహరించగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్, ప్రొఫెసర్ శరత్చంద్ర బాబు, ప్రొఫ్. జెఎం మిశ్రా, డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవి, అనిరుధ్ కుమార్, డాక్టర్ సురేష్ బాబు , అధ్యాపకులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన..గర్భిణులకు సీమంతాలు



ముగింపు సభలో మాట్లాడుతున్న కేసలి అప్పారావు

ప్రజాశక్తి-విజయనగరం కోట

తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ఐసిడిఎస్ ఆధ్వర్యాన మహిళా ప్రాంగణంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ముఖ్య అతిథిగా హాజరజయ్యారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యకత కతను వివరించారు. జన్మించిన దగ్గరనుండి సుమారు వెయ్యి రోజులు పాటు బిడ్డను ఆరోగ్య పరంగా పర్యవేక్షణ చేస్తూ ఉండాలని తెలిపారు. ముఖ్యంగా గర్భం దాల్చిన దగ్గర నుంచి ప్రసవించిన వరకు ఫాస్ట్ ఫుడ్, టీవీలు, సెల్ ఫోన్లకు దురంగావుండాలని సూచించారు. ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి మాట్లాడుతూ బిడ్డ కడుపులో పడిన దగ్గరనుండి సురక్షితంగా ప్రసవించిన వరకు అనేక ఆరోగ్య సూత్రాలు, ఆహారపు అలవాట్లు, వ్యాయామం, వైద్యులు సలహాలు సూచనలు పాటించాలని సూచించారు. వైద్యశాఖ అధికారులు సత్యవతి, రవికుమార్ , మెప్మా అధికారి శ్రీనివాసరావు , డిఆర్‌డిఎ అధికారి సావిత్రి మాట్లాడుతూ మహిళలు తల్లి పాలు సంస్కృతి అలవాటు చేయాలని, ఆసుపత్రుల్లో మాత్రమే ప్రసవాలు జరగాలని తెలిపారు. కార్యక్రమంలో నోడల్ అధికారి విజయకుమారి, ప్రాజెక్టు అధికారులు, సూపర్‌వైజర్లు, వన్ స్టాప్ సెంటర్ ప్రతినిధి సాయి లక్ష్మి, నేచర్, వైసిబి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వికాస్, ఝాన్సీ పాల్గొన్నారు.

పెరుగుతున్న గంజాయి బాబులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మత్తుకు అలవాటు అవుతున్న యువత నగరంలో పలు అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా రైల్వేస్టేషన్ ఏరియా, బాబామెట్ట, అయ్యప్ప నగర్, రింగ్ రోడ్డు ప్రాంతంలో అధికంగా గంజాయి బాబులు ఆగడాలు ఎక్కువగా ఉన్నాయి. పట్టపగలే గంజాయి తాగి వీధుల్లోకి వచ్చి వీరంగం సృష్టిస్తూ నగర ప్రజలను బయ కంపితులను చేస్తున్నారు. ఓ యువకుడు గంజాయి మత్తులో బుధవారం న్యూపూర్ణ సినిమా హాలు దగ్గరలో విక్రమ్ బార్ వద్ద ఓవృద్ధురాలి ఇంట్లో కత్తితో దూరి అలజడి సృష్టించాడు. ఎవరైనా దగ్గరికి వస్తే కత్తి చూపించి భయభ్రాంతులకు గురి చేశాడు. దీంతో అతడిని ఏమైనా అంటే ఏమి చేస్తాడోననీ భయంతో ఎవరూ దగ్గరకు వెళ్లలేదు. ఆ యువకుడు కొద్ది సేపు అలజడి సృష్టించినప్పటికీ పోలీసులకు సమాచారం ఇవ్వడానికి అందరూ భయపడ్డారు. మరోవైపు ఎక్కడి బడితే అక్కడ గంజాయి తాగిన యువకులు బైక్‌పై తిరుగుతున్నారు. ఎవరిని ఢీకొడతారోనని జనాలు భయపడుతున్నారు.

ఇంట్లో దూరి కత్తితో వీరంగం చేసిన యువకుడు

తరచూ ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి తోటపాలెం వెళ్లే రహదారిలో ఈ పరిస్థితి ఎదురవుతోంది. మద్యం కంటే తక్కువ డబ్బులకు గంజాయి దొరుకుతుండటంతో మత్తుకు బానిస అవుతున్నారు. కొంతమంది తల్లి తండ్రులు బయటకు చెప్పలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. నెల్లిమర్ల నగర పంచాయితీల్లో మంగళవారం జరిగిన పాలకవర్గ సమావేశంలో కూడా గంజాయి మీద చర్చ జరిగిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అద్దం పడుతుంది. పోలీసులు గంజాయి నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోకుంటే మరింత పెరిగి అనేక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పోలీసులు స్పందించి గంజాయి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

తైక్వాండో రాష్ట్ర పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజ్జి స్టేడియంలో జిల్లా జూనియర్ తైక్వాండో పోటీలు, 41వ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికలు బుధవారం జరిగాయి. జిల్లా నుంచి సుమారు 60మంది క్రీడాకారులు హాజరయ్యారు. విజయనగరం రాజీవ్ స్టేడియంలో ఈనెల 9, 10తేదీల్లో జరుగు రాష్ట్రస్థాయి పోటీలకు 24 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు పాల్గొని విజేతలకు పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా, రాష్ట్రానికి క్రీడాకారులు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు.

భారీ పోలీసు బందోబస్తు మధ్య

జిఎంఆర్ సంస్థకు క్వారీ అప్పగింత



ప్రజాశక్తి - భోగాపురం

తమ గ్రామ సమీపంలో కొత్తగా క్వారీని ఏర్పాటు చేయవద్దని గత కొన్ని రోజులు నుంచి అడ్డుకుంటున్న రామచంద్రపేట గ్రామస్తుల ఆశలు అడియాశలయ్యాయి. చివరకు కూటమి ప్రభుత్వం వచ్చాక క్వారీ అనుమతులు నిలిచిపోతాయనుకున్న ఆ గ్రామస్తుల కలలు ఆవిరయ్యాయి. భారీ బందోబస్తు మధ్య జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ నేరుగా రంగంలోకి దిగి క్వారీ పనులు చేసుకోవాలని జిఎంఆర్ సంస్థకు అప్పజెప్పారు. దీంతో గ్రామస్తులు ఏంచేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. బుధవారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టరు కార్తీక్, ఆర్‌డిఒ సూర్యకళ, తహశీల్దారు డిప్యూటీ తహశీల్దారు క్వారీ వద్దకు చేరుకున్నారు. అనంతరం సిఐ ఎ.రవికుమార్, ఎస్ఐలు సూర్యకుమారి, కృష్ణమూర్తితో పాటు భారీగా పోలీసులు మోహరించారు. క్వారీ వద్దకు గ్రామస్తులు వచ్చి అడ్డుకుంటారనే ఉద్దేశంతో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు కేసులు నమోదు చేస్తారనే ఉద్దేశంతో క్వారీ దరిదాపులకు రాలేదు. కూటమి నాయకులు కూడా చివరకు జోక్యం చేసుకోలేదు. దీంతో జిఎంఆర్ సంస్థ లారీలను, జెసిబిలు, పొక్లైనర్లన క్వారీ వద్ద దించి పనులను కూడా ప్రారంభించారు. దీనిపై జెసి జిఎంఆర్ సంస్థ సిబ్బందితో మాట్లాడుతూ గ్రామస్తులు ఏమైనా ఇబ్బందులు పెడితే వెంటనే ఆర్‌డిఒ, సిఐతో పాటు తన దృష్టికి తీసుకు రావాలని అన్నారు. ఇక్కడ రెవెన్యూ సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచుతామని అన్నారు. అందుకు మీ పనులు ప్రారంభించుకోవాలని ఆయన సూచించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తుల్లో ఆందోళన నెలకొంది. ఉన్న క్వారీలతో ఇప్పటికే ఇబ్బంది పడుతుంటే కొత్తగా క్వారీ వద్దని చెప్పినప్పటికి ఏకంగా జిల్లా అధికారులే రంగంలోకి దిగి క్వారీని అప్పజెప్పడంతో గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.


న్యాయమూర్తికి బిపి చెక్ చేస్తున్న డాక్టర్ తిరుమలప్రసాద్

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి : జిల్లా జడ్జి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా జడ్జి సాయి కల్యాణ చక్రవర్తి అన్నారు. బుధవారం స్థానిక న్యాయవాదుల సంఘం, తిరుమల మెడికవర్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో న్యాయ వాదుల సంఘం హాలులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ దైనందిన జీవితంలో అడుగడుగునా ఒత్తిడికి ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. ప్రస్తుత కాలంలో వాతావరణంలో, జీవన విధానం లో వస్తున్న మార్పుల కారణంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణలో శ్రద్ధ వహించాలని అన్నారు. డాక్టర్ తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యం పరిరక్షణలో నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. వైద్యులు, ప్రభుత్వం ఇస్తున్న సూచనలు ప్రతీ ఒక్కరూ పాటించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి,సమతుల్య, సంపూర్ణ పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో న్యాయ మూర్తులు, న్యాయ వాదులు, సిబ్బంది పలువురు పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం వైద్య బృంద సభ్యులను జిల్లా జడ్జి అభినందించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎ.హరీష్, కార్యదర్శి విజి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన వైస్ ఛాన్సలర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం గురజాడ విజయనగరం ఎన్ఎస్ఎస్ విభాగం అధ్వర్యంలో యూనివర్సిటీ ప్రాంగణంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ - ఛాన్సలర్ (ఇంఛార్జ్) ప్రొఫెసర్ డి. రాజ్యలక్ష్మి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవుల మనుగడకు, పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటడం ఎంతయినా అవసరమని, ప్రతీ ఒక్కరు కనీసం ఒక మొక్కనైనా నాటాలని అన్నారు. నాటిన ప్రతీ మొక్కను కూడా పరిరక్షించవలసిన బాధ్యత తీసుకోవాలి అన్నారు. కార్యక్రమంలో జెఎన్‌టియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ప్రొఫెసర్ ఆర్. రాజేశ్వరరావు, అకడమిక్ ఆడిట్ డైరెక్టర్, వి.మణికుమార్, ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్.ఎ శ్రీనివాసులు, ప్రోగ్రాం ఆఫీసర్, ఎస్.వేణుగోపాలరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



అన్నా క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదితి

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణం జరుగుతున్న నగరంలోని మూడు అన్నా క్యాంటీన్‌లను బుధవారం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు నగర కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్‌డిఎ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్‌లను ఈనెల 15 నుంచి పునః ప్రారంభించబోతున్న సందర్భంగా పరిశీలించినట్లు తెలిపారు. ఎన్‌టిఆర్ ఆశయాలను స్మరించుకుంటూ రూ.5కే భోజనం అందించడం అన్న క్యాంటీన్ ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డిఇ ప్రవీణ్ కుమార్, ఎంఇ కె.శ్రీను, ఎఇ కె.శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మి వరప్రసాద్, మండల పార్టీ కార్యదర్శి గంటా పోలి నాయుడు, ఎంపిటిసిలు రాజేష్ బాబు, వేచలపు శ్రీనివాస రావు, అవనాపు విజయ్, పిల్ల విజయ్ కుమార్, గాడు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.


ఎస్‌పికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వన్‌టౌన్ సిఐ శ్రీనివాస్

బాధ్యతలు స్వీకరించిన పలువురు సిఐలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో పలువురు సిఐలు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వీరంతా జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. ఎస్‌పిని కలసిన వారిలో వన్‌టౌన్, ట్రాఫిక్, రాజాం, కొత్తవలస, ఎస్.కోట సిఐలు ఉన్నారు.


ప్రధాని మోడీకి పుస్తకాన్ని అందజేస్తున్న ఎంపి కలిశెట్టి

ప్రధానిని కలిసిన ఎంపి కలిశెట్టి

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పల నాయుడు బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిశారు. డాక్టర్ పివిజి రాజు శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆయన జీవిత చరిత్రను తెలిపే పుస్తకాన్ని మోడీకి అందజేశారు. ఈ సందర్భంగా కేంద్రమాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు యోగా క్షేమాలపై మోడీ ఆరా తీసినట్లు ఎంపి తెలిపారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

జాతీయ చేనేత దినోత్సవం బుధవారం నగర పంచాయతీ పరిధి పద్మశాలి వీధి భక్త మార్కండేయ భవనంలో పద్మశాలి సంక్షేమ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు జి. రాము, జిల్లా యువజన అధ్యక్షుడు సప్పా ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సప్పా ప్రసాద్ మాట్లాడుతూ చేనేతలపై జిఎస్‌టి తొలగించి నేతన్నలను ఆదుకోవాలని కోరారు. నూలుపై సబ్సిడీ ఇచ్చి వారిని ప్రోత్సహించి రాష్ట్ర ప్రభుత్వం నేతన్నలకు నేతన్న నేస్తం పథకం లాగా ఏదైనా ఒక పథకం పెట్టి ప్రతి మగ్గం ఉన్న కార్మికులకు అందజేయాలని కోరారు. నేతన్నకు చేయుతగా ఫించన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేనేత దినోత్సవంలో భాగంగా 21 మంది నేత కార్మికులకు సన్మానం ఆర్థిక సహాయం చేసి 11 మంది మహిళ కార్మికులకు చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పెద్దల కమిటీ చైర్మన్ టి. వెంకటేశ్వరరావు, బిజెపి నాయకులు ఐ. సుధీర్, ఐవి.రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు కె.బలరాం. టి.అప్పలరాజు, ఎం.నారాయణ, టి.ప్రసాద్ పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగానే ఇసుక విక్రయం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి ఇసుక స్టాక్ పాయింట్ వద్ద నిబంధనల ప్రకారమే ఇసుక విక్రయాలు జరుగుతున్నాయని ఆర్‌డిఒ ఎ.సాయిశ్రీ తెలిపారు. బుధవారం ప్రజాశక్తిలో 'ఇసుక అమ్మకాల్లో అక్రమాలు' శీర్షికన ప్రచురితమైన వార్తకు ఆమె స్పందించారు. స్టాక్ పాయింట్ వద్ద ఎటువంటి అక్రమాలు జరగడం లేదని స్పష్టం చేశారు. ఇక్కడ సిసి కెమేరాలు పనిచేస్తున్నాయని, అయితే తూనిక యంత్రం మాత్రం పనిచేయడం లేదని తెలిపారు. అయినప్పటికీ, ఎక్కువ ఇసుకను లోడింగ్ చేయడం లేదని, కొలతల ఆధారంగా ఇస్తున్నామని తెలిపారు. తూనిక యంత్రాన్ని మరమ్మతు చేయించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆర్‌డిఒ తెలిపారు.

రాష్ట్ర రహదారులపై టోల్ గేట్లను రద్దు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర రహదారులపై టోల్‌గేట్ ఛార్జీలతో ప్రజానీకం, వాహన వాహనదారులపై అధిక భారాలను మోపే ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని ఆలిండియా రోడ్ ట్రాన్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ ఎ.జగన్మోహన్ రావు డిమాండ్ చేశారు. త్రైమాసిక రోడ్ టాక్స్ వసూల్ చేస్తున్నారని, హైవేలో ఏప్రిల్ 1నుంచి పెంచిన టోల్‌గేట్ ఛార్జీలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. జొన్నాడ వద్ద పెట్టిన టోల్‌గేట్‌ను, రామవరం, మానాపురం వద్ద ఏర్పాటు చేస్తున్న టోల్‌గేట్లను రద్దు చేయాలని కోరారు. కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి ప్రమీల

ప్రోటోకాల్ పాటించాలి : ఎంపిపి

గుర్ల: గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించిన సందర్భంలో ప్రోటోకాల్ పాటించాలని ఎంపిపి పొట్నూరు ప్రమీల అన్నారు. బుధవారం ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి తిరుపతి రావు ప్రగతి నివేదికను సభ్యులకు తెలిపారు. విత్తనాల పంపిణీలో కూటమి నాయకులను పిలిచి పంపిణీ చేయడంపై సర్పంచులు, ఎంపిటిసిలు అభ్యంతరం తెలిపారు. ఈ విషయమై ఎంపిపి మాట్లాడుతూ అధికారులు ప్రోటోకాల్ను పాటించాలని ఆదేశించారు. గ్రామాల్లో విఒఎ మార్పుడంపై జెడ్పిటిసి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేస్తే పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. అనంతరం రెవెన్యూ, తాగునీరు, ఉపాధిహామీ, ఐసిడిఎస్ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను సభ్యులకు తెలియజేశారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు, వైస్ ఎంపిపి తిరుపతి రావు, అంబల్ల చిన్నారావు, ఎంపిడిఒ వెంకటరమణ, తహశీల్దార్ ఆదిలక్ష్మి వివిధ శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

వెల్నెస్ సెంటర్కు జాతీయ స్థాయి గుర్తింపు

పూసపాటిరేగ: మండలంలోని పూసపాటిరేగ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గల చౌడువాడ అగ్రహారం ఆరోగ్య ఉపకేంద్రానికి జాతీయ నాణ్యత ప్రమాణాలలో ప్రతిభ కనపరిచినందుకు జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని బుధవారం వైద్యాధికారి డాక్టర్ రాజేష్ వర్మ తెలిపారు. జూలై 11వ తేదిన ఇద్దరు కమిటీ బృందం సందర్శించి పలు అంశాలను అంచనా వేశారన్నారు. ఓపి, ల్యాబ్, ఫార్మసీ, టెలికన్సల్టెన్సీ ఎక్విపమెంట్, వ్యాధినిరోధక టీకాలు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాల ప్రాతిపదికగా అంచనా వేశారన్నారు. వెల్నెస్ సెంటర్లో పనిచేస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, ఏఎన్ఎమ్, ఆశా కార్యకర్తలు, ప్రజలతో చర్చించి 89శాతం మార్కులతో ఫుల్ సర్టిఫికేషన్ ఇచ్చారన్నారు. ఈ సర్టిఫికేషన్ రావడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు

ఉప విద్యాశాఖాధికారి ఆకస్మిక తనిఖీ

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బొబ్బిలి డివిజన్ ఉప విద్యా శాఖాధికారి కె. మోహనరావు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో గురువారం జరగనున్న పేరెంట్స్ కమిటీ ఎన్నికలను పగడ్బందీగా నిర్వహించాలని, ఓటర్లు అందరూ హాజరు య్యేలా చూడాలని చెప్పారు. ఓటర్ల లిస్టులను పరిశీలించారు. ఇతర రిజిస్టర్లు, రికార్డులు సక్రమంగా ఉంచాలని, 3,6,10 తరగతుల విద్యార్థుల నోట్ బుక్స్, వర్క్ బుక్స్ చూసి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం వండుతూ నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులందరూ లెసన్ ప్లాన్, డైరీ రాస్తూ వెనుకబడిన విద్యార్థులకు రెమిడియల్ విద్య అందించాలని కోరారు. ఈ తనిఖీలో అతని వెంట ఇంచార్జ్ హెచ్ఎం టి. వెంకట లక్ష్మి, ఉపాధ్యాయులు ఈశ్వరరావు, సత్యనారాయణ, రమేష్, రామారావు, త్రినాథ్, శ్రీనివాస్ ఉన్నారు.

గుడివాడ పాఠశాల పరిశీలన

వేపాడ: మండలంలోని గుడివాడ ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి.బాల భాస్కరరావు బుధవారం పరిశీలించారు. పాఠశాల పరిసరాలు, వంట గది, టాయిలెట్స్, విద్యార్థుల నోట్ బుక్స్, విద్యార్థులతో తెలుగు ఇంగ్లీష్ పాఠాలు చదివించడం, చతుర్విధ ప్రక్రియలు, విద్యార్థులకు పంపిణీ చేసిన స్టూడెంట్ కిట్స్ పరిశీలన చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎస్ఎంసి ఎన్నికలు సక్రమంగా జరిగేలా విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

గుంతలు పూడ్చివేత

వేపాడ: మండలంలోని సోంపురం, సీతంపేట కల్లాల వద్ద, ఆతవ జంక్షన్, వల్లంపూడి, దబ్బిరాజుపేట కూడలి వద్ద రోడ్డుకు పడిన గుంతలను బుధవారం పూడ్చివేశారు. ఈ గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయని ఇటీవల స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో సామాజిక కార్యకర్తక అప్పారావు ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆమె వెంటనే ఆర్అండ్బి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో ఆర్అండ్బి జెఇ ఆధ్వర్యంలో ఆయా రహదారుల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తాత్కాలికంగా పనులు చేపట్టారు.

కొత్త కోర్సులపై అవగాహన

నెల్లిమర్ల: ఆనిమేషియా విద్యార్థులకు కొత్త కోర్సులపై అవగాహన ఉండాలని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి అన్నారు. రానున్న కాలంలో ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేపడతామన్నారు. బుధవారం మూడు, ఐదో సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు నూతన కోర్సులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి, రిసోర్స్ పర్సన్లుగా డాక్టర్ సివికెబి చైతన్య, కె.వి.కళ్యాణ్, ప్రీతం పరిడా, డాక్టర్ దేవికారాణి, డాక్టర్ మాధవి వ్యవహరించారు.

యుద్ధ ప్రాతిపదికన పనులకు చర్యలు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామ సమీపం సాయన్న ఛానల్ పరిధి చిట్టిగెడ్డ కాలువ షట్టర్లు విరిగి పోయి సాగునీరు వృథాగా పోతుందని ప్రజాశక్తిలో ప్రచురించిన కథనానికి ఇరిగేషన్ అధికారులు ఏఇ లక్ష్మి రాణి, ఎఇ రాజేష్ కుమార్ స్పందించి బుధవారం పరిశీలించారు. సాయన్న ఛానల్ పరిధి పిల్ల కాలువలకు సంబంధించి సాగునీరు వృథాగా పోవడంతో 11,600 ఎకరాలకు సాగునీరు రాలేదని రైతులు చెబుతున్నారు. బ్రిటిష్ నాటి సాయన్న ఛానల్, వాటి పిల్ల కాలువలకు రెగ్యులేటర్లు శిథిలావస్థలో ఉన్నాయని అధికారులు ఇంతవరకు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు తయారు చేసి పంపిస్తామని నిధులు మంజూరు అయిన వెంటనే పనులు చేపడతామని రైతులకు అధికారులు హామీ ఇచ్చారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

బొబ్బిలి: మాదకద్రవ్యాల నివారణకు పోలీసులు వాహనాలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. పాతబొబ్బిలి కూడలి వద్ద బుధవారం ఎస్ఐ లోవరాజు, పోలీస్ సిబ్బంది ఒడిశా నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. గంజాయి, నాటుసారా, ఇతర మత్తు పదార్థాలను నివారించేందుకు వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు లోవరాజు చెప్పారు. మాదకద్రవ్యాల నివారణకు సహకరించాలని ప్రజలను కోరారు.

సిఐగా నారాయణమూర్తి బాధ్యతల స్వీకరణ

శృంగవరపుకోట: ఎస్.కోట పోలీస్ స్టేషన్ నూతన సిఐగా వి. నారాయణమూర్తి బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకు ఈ స్టేషన్ సిఐగా బాధ్యతలు నిర్వర్తించిన మురళీరావు విశాఖపట్నం విఆర్కు బదిలీ కావడంతో నారాయణమూర్తి ఎస్.కోట సిఐగా బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నారాయణమూర్తికి స్టేషన్ సిబ్బంది ఆహ్వానం పలికారు.

విద్యుదాఘాతంతో వెల్డర్ మృతి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

పట్టణంలోని పందిరప్పన్న జంక్షన్ వద్ద బుధవారం విద్యుదాఘాతంతో దార్ల సతీష్ (31) మృతి చెందాడని ఎస్ఐ గంగరాజు తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన దార్ల వెంకటరావు తన పెద్ద కుమారుడు సతీష్, కోడలు రజిని, చిన్న కుమారుడు శంకర్లతో కలసి పట్టణంలోని జగనన్న కాలనీలో నివాసముం టున్నారు. తండ్రి వెంకట్రావు, పెద్ద కుమారుడు సతీష్ పట్టణంలోని సుబ్బరామిరెడ్డి కళ్యాణ మండ పం పక్కన వెల్డర్ పనులు చేస్తుంటారు. బుధవారం పందిరప్పన్న జంక్షన్ వద్ద ఇప్పిలి కొండలరావుకు చెందిన ఇంట్లో ఇంటీరియర్ పని నిమిత్తం 20 అడుగుల ఇనుప రాడ్డును పైన బిల్డింగులోకి తీసుకువెళ్లే సమయంలో తమ్ముడు శంకర్ కింద నుండి ఇనుప పైపును అందించగా అన్న సతీష్ మేడ పై నుండి పైపును లాగుతున్న సమయంలో ఇంటి ముందుగా ఉన్న విద్యుత్ హై టెన్షన్ వైర్లకు ఇనుప పైపు తగలడంతో సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటి యజమాని కొండలరావు కూడా అక్కడే ఉండడంతో అతని తలకు గాయమైంది. మృతుని తండ్రి వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. సంఘటన జరిగిన వెంటనే ఎలక్ట్రికల్ ఎఇ రవి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

పోలీసుల అదుపులో ఐదుగురు యువకులు

ప్రజాశక్తి - భోగాపురం

గంజాయి మత్తును వదిలించేందుకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. దీనిలో భాగంగా భోగాపురం పోలీసులు ఐదుగురు యువకులను అదుపులో తీసుకున్నట్లు సమాచారం. ఇందులో ఒక వ్యక్తి అమ్మకాలు చేస్తుండగా నలుగురు ఆయన వద్ద నుంచి కొనుగోలు చేసినట్టు తెలిసింది. దీంతో పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

నారుమళ్లు పరిశీలించిన ఎడిఎ

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని నెలివాడ రైతు సేవా కేంద్రం పరిధిలో యంత్రాల ద్వారా వరిసాగు చేపట్టేందుకు సిద్ధం చేస్తున్న నారుమళ్ళను బుధవారం గజపతినగరం వ్యవసాయ సహాయ సంచాలకులు కె మహారాజన్, ఎఒ మల్లికార్జున్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎడిఎ కె. మహారాజన్ మాట్లాడుతూ యంత్రాల ద్వారా వరి నాట్లు చేపట్టడం వల్ల ప్రతి ఎకరానికి నాలుగు నుంచి ఐదు వేల రూపాయలు వ్యవసాయ ఖర్చులను పెట్టుబడిలో తగ్గించుకోవచ్చని అన్నారు. సకాలంలో వర్షాలు లేక నీటి కొరత వల్ల నాట్లు ఆలస్యం అయ్యే పరిస్థితుల్లో ఈ పద్ధతి ద్వారా పది రోజులు ముందుగానే నారుని సిద్ధం చేసుకోవచ్చని తెలిపారు. ఆయన వెంట నెలివాడ రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు ఐ.అనిల్, నెలివాడ గ్రామ రైతులు పాల్గొన్నారు.


వరి నారును పరిశీలిస్తున్న ఎడిఎ

బ్రహ్మాస్త్రం తయారీపై అవగాహన

గంట్యాడ: మండలంలోని తాటిపూడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇంచార్జి వర్రీ గాయత్రి వరిలో పురుగుల నివారణకు బ్రహ్మాస్త్రం తయారుపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ బ్రహ్మాస్త్రం తయారు చేయటానికి దేశీ ఆవు మూత్రం 15 లీటర్లు, వేపాకు రెండు కేజీలు, సీతాఫలాలు 2 కేజీలు, బొప్పాయి ఆకులు రెండు కేజీలు, కానుగాకులు 2 కేజీలు, జామ ఆకులు రెండు కేజీలు తీసుకుని ముద్దగా తయారు చేసుకోవాలన్నారు. ఈ మిశ్రమాన్ని పొంగు వచ్చే వరకు మరగ బెట్టి, ఈ కషాయాన్ని 48 గంటలు చల్లార్చాలని, ఎకరానికి ఐదు లీటర్లు చొప్పున 100 లీటర్ల నీటిలో కలుపుకొని స్ప్రే చేసుకోవాలని సూచించారు. దీని వల్ల రసం పీల్చే పురుగు, పెద్ద పెద్ద పురుగులు నివారణ అవుతాయని అన్నారు. ఖర్చు తగ్గి పంట దిగుబడి పెరిగి అధిక లాభాలను సాధించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జ్యోతి, సింహాచలం, రామ్మూర్తి, రైతులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని పినపెంకి గ్రామంలో ఎఒ కె.శిరీష తాడు సహాయంతో వరి నాట్లు (లైన్ ప్లాంటింగ్) వేయించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. వరుసలో వరి నాట్లు వేసుకోవడం వల్ల గాలి, వెలుతురు చేనుకు బాగా తగిలి సాధారణం ఉడుపు కన్నా ఎక్కువగా పిలకలు పెట్టి దుబ్బు బాగా చేస్తుందన్నారు. తద్వారా దిగుబడి బాగుంటుందని తెలిపారు. వరుసల్లో ఉండడం చీడపీడలు ఉనికి గమనించి సస్యరక్షణ చర్యలు సకాలంలో చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. సాధారణం కంటే 2-3 క్వింటాలు దిగుబడి ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ పుష్పలత, విఎఎ సాయికుమార్, పాల్గొన్నారు.


బ్రహ్మాస్త్రం తయారు చేస్తున్న సిబ్బంది

మొక్కజొన్న పంట పరిశీలన

మండలంలోని పాల్తేరు గ్రామంలో పత్తి, మొక్కజొన్న పంటలను ఎఒ పరిశీలించారు. మొక్కజొన్నలో పీక పురుగు నివారించడానికి కార్బోఫురన్ గుళికీలు ఎకరానికి మూడు కిలోలు చొప్పున వేయాలన్నారు. కత్తెర పురుగుకు బెంజొయేట్ 100 గ్రాములు, 200 ఎంఎల్ నీటిలో కలుపుకుని పిచికారీ చేయాలన్నారు.


అటోను ఢీకొని రోడ్డుపై పడిపోయిన తండ్రి, పిల్లలు

ప్రమాదకరంగా మలుపు

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని ఏరుకుల పాకల గ్రామం రోడ్డు మలుపు ప్రమాదకరంగా మారింది. బుధవారం ఇదే గ్రామానికి చెందిన దాసరి సత్యం గజరాయుని వలస యూపీ స్కూల్లో చదువుతున్న తమ పిల్లలను ద్విచక్ర వాహనంపై తీసుకువస్తుండగా బాడంగి నుంచి వస్తున్న ఆటో మలుపు వద్ద ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. దీంతో బండిపై కూర్చున్న పిల్లలు రోడ్డుపై పడిపోయారు. ఆ సమయంలో భారీ వాహనాలు రోడ్డుపై ప్రయాణించకపోవడం వల్ల ఎటువంటి ప్రమాదమూ జరగలేదు. ఈ ప్రమాదకరమైన మలుపు వల్ల ఎరుకలపాకల గ్రామంలోని పిల్లలను గజరాయునివలస యూపీ స్కూల్కు పంపించాలంటే తల్లిదండ్రులు భయాం దోళన చెందుతున్నారు. ఇకనైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ఎరుకలపాకలలో ఉన్న ఎంపిపి స్కూల్లోనే ఒకటి నుంచి ఐదు తరగతులు వరకూ తమ పిల్లలు ఇక్కడే చదువుకునేలా చర్యలు తీసుకోవాలని ఏరుకులపాకల గ్రామస్తులు కోరుతున్నారు.

తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తవలస

తల్లిపాలతో పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, తల్లిపాలతో పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం మండలంలోని వియ్యంపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సిడిపిఒ ఆర్.ఉమాదేవి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు తాగిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. గర్భిణులు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని, పిల్లలు పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించాలని సూచించారు. తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యమని, తల్లిపాల ప్రాముఖ్యత గురించి ముర్రుపాల గురుంచి తల్లి బిడ్డల శ్రేయస్సులో మన పాత్ర ఏమిటి అనే అంశాలను గూర్చి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము, ఉపాధ్యక్షులు యల్లపు సూరిబాబు, ప్రధాన కార్యదర్శి కనకాల శివ, చింతలపాలెం సర్పంచ్ మాకెన నవీన్ పాత్రుడు, క్లస్టర్ ఇంచార్జ్ పొట్నూరు వెంకట రత్నాజి, ఎంఇఒ, అంగన్వాడీ సూపర్వైజర్లు రవణమ్మ, స్వర్ణలత, అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుడుకి ట్రై సైకిల్ పంపిణీ

శృంగవరపుకోట: శ్రీ గురుదేవ చారిట్రబుల్ ట్రస్ట్ అధినేత జగదీశ్ బాబు ఆధ్వర్యంలో మండలంలోని భర్తాపురం గ్రామం భవాని నగర్కి చెందిన వికలాంగుడు ఆడారి సూర్యనారాయణకి మూడు చక్రాల బ్యాటరీ సైకిల్ బండిని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బీశెట్టి అరుణ, యూనిట్ ఇంచార్జ్ ఆడారి సూరి అప్పారావు, ఐటిడిపి అధ్యక్షులు అనకాపల్లి చెల్లయ్య, క్లస్టర్ ఇంచార్జ్ కాపుగంటి వాసు, గన్ను బంగారమ్మ, గనివాడ లక్ష్మి, మహిళా నాయకులు బోనంగి జ్యోతి, గనివాడ బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.


కొత్తవలస: గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న ఎమ్మెల్యే

ప్రభుత్వ నిర్ణయం హర్షనీయం

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీసున్న నిర్ణయం హర్షనీయమని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గొర్లె పద్మావతి అన్నారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఆదేశానుసారం ఉపాధ్యాయులకు 'మరుగుదొడ్ల ఫోటోల తీయడం' అనే బాధ్యతను తప్పించడం చాలా మంచి పరిణామం అని అన్నారు. మంత్రికి రాష్ట్ర ఉపాధ్యాయులందరి తరుపున ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులందరి తరపున కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు వెల్లడించారు. మరుగుదొడ్ల పరిశు భ్రంగా ఉండేటట్లు చూడడం ప్రధానోపాధ్యాయుల బాధ్యత అయినప్పటికీ, పాఠశాలకు ఉపాధ్యాయులు వస్తూనే ప్రార్ధన కంటే ముందు బాత్రూమ్ బాట పట్టి ఫోటోలు తీయడం అనేది ఉపాధ్యాయల ఆత్మ గౌరవానికి ఇబ్బంది ఉండేదన్నారు. అందులోనూ పురుషులు వినియోగించే మరుగుదొడ్లలో మహిళా ఉపాధ్యాయినిలు వెళ్లి ఫొటోస్ తీయడం చాలా ఇబ్బందిగా ఉండేదని ఆమె వాపోయారు. ఉపాధ్యాయుల ఇబ్బందిని గమనించి విద్యాశాఖా మంత్రి తీసుకున్న నిర్ణయం హర్షనీయమని అన్నారు. లోకేష్ పాద యాత్రలో మాట ఇచ్చిన ప్రకారం జిఒ 117ని కూడా రద్దు చేయడంతో పాటు, తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే ఇవ్వాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. అలా చేయడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అయ్యేందుకు దోహదమవుతుందని చెప్పారు.



'అవంతీ'లో ముగిసిన శిక్షణ

గరివిడి: స్థానిక అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో జీవన నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్పై గత నెల రోజులుగా ఇస్తున్న బుధవారం ముగిసింది. డిప్లమో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఇన్ఫోసిస్ సహకారంతో బెంగళూరుకు చెందిన ఎస్జిబిఎస్ ఉన్నతి ఫౌండేషన్ శిక్షకులు టి.ప్రత్యూష, పి.శాంతిలత ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల రోజులు పాటు జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులకు అనేక విషయాలపై అవగాహన కల్పించారన్నారు. ముఖ్యంగా కెరీర్ మీద స్పష్టత ఎలా సాధించాలి, కమ్యూనికేషన్ ఎలా పెంపొందించుకోవాలి, ఇంటర్వ్యూకి ఎలా ప్రిపేర్ అవ్వాలి, రెజ్యూమ్ ఎలా తయారు చేసుకోవాలి, ఒత్తిడిని ఎలా జయించాలి? సమయపాలన, బాధ్యత తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు శిక్షణలో నేర్చుకున్న అంశాలపై స్కిట్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్.ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఎఒజి అనిల్ కుమార్, వివిధ విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

ఆట, పాటపై శిక్షణ

విజయనగరం కోట: నగరంలోని నవ చైతన్య కళా మండలి, గిడుగురామ్మూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం ఆధ్వర్యంలో జానపద కళాకారులకు బుధవారం ఆట పాటలపై శిక్షణ ఇచ్చారు. శివ భాగవతం, తప్పెట గుళ్ళు , జముకు, చెక్క భజన, డప్పు, జాలరి నృత్యం, పల్లె పదాలు వంటి వాటిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జాన పద కళాపీఠం అధ్యక్షులు బద్రి కూర్మారావు మాట్లాడుతూ అంతరించి పోతున్న కళలను కాపాడి భావితరాలకు అందించాలని కోరారు. నవ చైతన్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. చిన్నారెడ్డి, అట్టాడ లక్ష్మినాయుడు భృతి కల్పించాలని కోరారు.

రోడ్డు బాగు చేయండి

బొబ్బిలి: పట్టణ ప్రజలు ఇబ్బందులు పడకుండా రోడ్లు బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ కోరారు. పట్టణంలోని అమ్మిగారికోనేరుగట్టు, ఓంకార్ థియేటర్, మేధరబంద, కూరగాయలు మార్కెట్ ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. మేధరబంద జంక్షన్లో కాలువలో పూడికలు తొలగించాలని, అమ్మిగారి కోనేరు గట్టు రోడ్డు తాత్కాలికంగా బాగు చేసేందుకు అంచనాలు తయారు చేయాలని ఎఇలు సురేష్, రవికుమార్ను ఆదేశించారు. షాపింగ్ కాంప్లెక్స్ లోపలకు పశువులు వెళ్లకుండా గేట్లు ఏర్పాటు చేయాలని కమిషనర్ రామలక్ష్మిను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.
పోలీసుల అదుపులో ఐదుగురు యువకులు

డీలర్ల సమస్యలపై స్పందనకు హర్షం

రామభద్రపురం: రాష్ట్రంలో డీలర్లు ఎదుర్కుంటున్న సమస్యలపై ఇటీవల కలెక్టర్ల సమావేశంలో సిఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించి పాత వ్యవస్థనే పునరుద్ధరించేందుకు సుముఖత వ్యక్తం చేయడం ఆనందదాయకమని జిల్లా డీలర్ల సంఘం కన్వీనర్ చొక్కాపు రామారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం వద్ద చంద్రబాబు చిత్రపటానికి మండలంలో డీలర్లు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టంగా నిర్వహిస్తున్న డీలర్ల వ్యవస్థను వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్లు గంట నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF SENIOR CIVIL JUDGE, RAJAM.
I.P. 03 /2024

Between: **Gopisetti Sreeram Murty @ Srinu**
---Petitioner
And: **Gunapu Ramulamma and 26 others**
---Respondents
To,
The Respondents are:-
1. Gunapu Ramulamma, W/o Ramakrishna, age 50 years, Housewife, R/o S.C.coloney, Kancharam Village, Rajam Mandal, Vizianagaram District.
2. Gunapu Lakshmanarao, S/o Ramakrishna, age 30 years, Cultivation, -rest do-
3. Rajana Rajeswari, W/o Suryanarayana, age 40 years, House wife, S.C. Colony, Rajam
4. Kallepalli Gnaneswari, W/o late Balaram, age 35 years, Private employee, -rest do-
5. Sanasana Appamma, W/o late Bagiyya, age 60 years, Cultivation, -rest do-
6. Battina Pentayya, S/o not known, age 60 years, Rikshaw Puller,-rest do-
7. Battina Chinna, W/o not known, age 50 years, Cultivation-rest do-
8. Reyya Butchamma, W/o Asirayya, age 65 years, -rest do-
9. Reyya Ramesh, S/o Asirayya, age 35 years, private employee, -rest do-
10. Regidi Lakshmi, D/o Anand, age 45 years, Daily labor, -rest do-
11. Muddada Gouramma, W/o not known, age 40 years, Daily labor, -rest do-
12. Battina Chintamma, W/o Appalaswami, age 45 years, -rest do-
13. Battina Gouramma, W/o Dalayya, age 60 years, Daily labor, -rest do-
14. Battina Gurunadh, S/o not known, age 50 years, Cultivation, -rest do-
15. Devarasetti Suneetha, W/o late Srinivasarao, age 60 years, Panshop, Rajayyapeta, Rajam
16. Tuthika Eswaramma, D/o Poliraju, D/o Poliraju, age 40 years, Housewife, Devangula colony, Rajayyapeta, Rajam.
17. Emala Thatharao, S/o not known,age 45 years, Kirana Shop, -rest do- 18. Thogireddi Lakshmi, W/o Appalanaidu, age 60 years, Housewife, B.C.Coloney, R/o Kancharam Village of Rajam Mandal.
19. Karra Suryanarayana, S/o not known, age 50 years, Quilts maker, -rest do
20. Maroju Sankarrao, S/o Mallikharjunarao, age 35 years, Private employee, Goruveedhi, Kancharam Village, Rajam Mandal.
21. Maroju Srinivasarao, S/o Mallikharjunarao, age 50 years, Cycle shop, -rest do
22. Goru Suresh, S/o late Appalaswamy, age 35 years, Daily labor, -rest do-
23. Akula Chinnammadu, W/o Manmadharao, age 55 years, Panshop, R/o 4th lane, Mallikharjuna coloney, Rajam
24. Tuthika Anasuya @ Anu, W/o Koteswararao, age 35, Tailaring, R/oBukka Street, Rajam Town and Mandal.
25. Mamidipaka Lakshmi, W/o Narayana Murty, age 60 years, R/o Kakarla Street, Rajam.
26. Golla Ramu, S/o Appayya, age 50 years, Coolie, -R/o S.C.Coloney, Kancharam, Rajam Mandal
27. Papireddy Yasoda, W/o Madhava, Housewife, age 30 years, R/o Chinacheruvu gattu, Seethalakshmi Theater, Rajam.

మీ పైన పై నెంబర్ పిటిషన్ దాఖలు చేసినందున మీకు ఏమైనా ఆక్షేపనలు ఉన్న ఎడల **తే 29-08-2024 దిన ఉ॥ గం॥ 10:30 ని॥లకు** మీరు ప్రత్యక్షంగా గాని వకీలు ద్వారాగాని పై కోర్టు వారి ఎదుట హాజరై మనవి చేసుకోవలెయును. అటుల మీరు జరిగించని ఎడల మీ పరోక్షమందు పిటిషనర్కు అవసరమైన ఆర్డర్ జారీ చేయడమగును అని ఈ నోటీసు మూలంగా మీకు తెలియ పరచడమైనది.

రాజాం
తేది: 07-08-2024.

కె. రమణమూర్తి
బి. మంజుల
న్యాయవాదులు
రాజాం.

సైకిల్ యాత్రికునికి స్వాగతం

ప్రజాశక్తి- రేగిడి

సేవ్ ట్రీస్, సేవ్ లైన్స్ అనే స్లోగన్తో 27 రాష్ట్రాలు చుట్టి వచ్చి, 19వేల కిలోమీటర్లు సైకిల్ యాత్ర పూర్తి చేసి ఇప్పుడు మరోసారి పశ్చిమ బెంగాల్లో బయలు దేరి కేరళ రాష్ట్రం వరకు సైకిల్ యాత్ర చేస్తున్న సుప్రియ దాస్కు బుధవారం రేగిడి మండలం సంకిలి, రాజాం మండల కేంద్రంలో పర్యావరణ సమితి ఆపూర్వ స్వాగతం పలికింది. పాలకొండ నుంచి రేగిడి మండలం రాజాం మీదుగా కోరాపుట్ వెళ్లే మార్గంలో రేగిడి ఎంఐసి కోఆర్డినేటర్ కెంబూరు శ్రీనివాసరావు సంకిలి వద్ద స్వాగతం పలికి ఆతిథ్యం అందజేశారు. రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రీన్బెల్ట్ కన్వీనర్ ఆర్విజె నాయుడు, పెంకి చైతన్య కుమార్ ఘనంగా స్వాగతం పలికారు. బొబ్బిలి రోడ్లో కొత్తాసాయి ప్రశాంత్ కుమార్, జ్ఞాన జ్యోతి విద్యాలయం కరస్పాండెంట్ తారక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వేగిరెడ్డి సుబ్బారావు స్వాగతం పలికారు. పర్యావరణం పరిరక్షణ చేయాలన్న ప్రచారం చేస్తున్న సుప్రియ దాస్ సంకల్పాన్ని అందరూ కొనియాడారు. అనంతరం సాయి ప్రశాంత్కుమార్, రాజ్ నాయుడులు సుప్రియ దాస్కి ఆతిథ్యం ఇవ్వడమే కాకుండా ఆయన యాత్రకు ఆర్థిక సహాయం అందజేశారు.

'సీతం'లో తరగతులు ప్రారంభం

విజయనగరం టౌన్: సీతం ఇంజనీరింగ్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జెఎన్టియు-గురజాడ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్ చదువు తర్వాత విశ్రాంతి తీసుకోకుండా ఇంజనీరింగ్తోపాటు ఎంఒసి కోర్సులపై దృష్టి సారించి నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ పిల్లల చదువు, ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించాలని, విద్యార్థి జీవితంలో ఎన్సిసి, ఎన్ఎస్ఎస్ ప్రాముఖ్యత గురించి వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డివి.రామమూర్తి, డాక్టర్ కె.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన క్రీడాకారులు

విజయనగరం టౌన్ : ఈనెల 3,4 తేదీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన సబ్ జూనియర్, కేడెట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. సబ్ జూనియర్ పూమూసే విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్ ఫస్ట్ ప్లేస్, క్యరోగి సబ్ జూనియర్ విభాగంలో ఓవరాల్ ఛాంపియన్షిప్ ఫస్ట్ ప్లేస్, కేడెట్ విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్లో మొదటి స్థానాన్ని జిల్లా క్రీడాకారులు కైవసం చేసుకున్నారు. ఇందులో 14 గోల్డ్ మెడల్స్ , 7 సిల్వర్మెడల్స్, 11 బ్రాంజ్ మెడల్స్ గెలుపొం దారు. వీరికి శిక్షణ ఇచ్చిన కోచ్లు ఎం.గగన్ సాగర్ దొర, కె.చైతన్య, సిహెచ్ యశ్వినిలను, గెలుపొందిన క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గురాన అయ్యలు, వేణు గోపాలరావు అభినందించారు.


సర్పంచ్లకు శిక్షణ

వంగర: మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు, పంచాయతీల అభివృద్ధికి సంబంధించి మూడు రోజులు పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపిడిఒ సాల్మన్రాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

టిడిపి నాయకుడు గొండేల ప్రకాష్ మృతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోన 32వ డివిజన్ టిడిపి నాయకుడు, నియోకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షుడు గొండేల ప్రకాష్ (కండువా ప్రకాష్) (53) అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతి చెందారు. ఆయన కొద్దిరోజుల క్రితం కేన్సర్ బారిన పడి విశాఖలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. విజయనగరంలో కండువా ప్రకాష్గా అందరికీ సుపరిచితులు. ఆయన తొలి నుంచి టిడిపి కార్యకర్తగా ఉంటూ నాయకుడి స్థాయికి ఎదిగారు. చివరకు చనిపోయే కొన్ని గంటల ముందు కూడా మెడలో కండువా వేసుకొని విక్టరీ సింబల్ చూపిస్తూ కన్నుమూయడం టిడిపి శ్రేణులను కలచివేసింది. ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి, 32వ డివిజన్ టిడిపి నాయకులు కరణం సూర్యతేజ, పలువురు నాయకులు, కార్యకర్తలు సందర్శించి నివాళులర్పించారు. ప్రకాష్ కుటుంబాన్ని పార్టీ పరంగా ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఆర్టిసి రూట్ సర్వే

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని జాకేరు, కరకవలస, చామలాపల్లి, దబ్బిరాజుపేట గ్రామాలకు వెళ్లే బస్సు రూట్ను ఆర్టిసి అధికారులు బుధవారం పరిశీలించారు. బక్కునాయుడుపేట ఎపి ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జాకేరు మీదుగా కరకవలస, చామలాపల్లి, దబ్బిరాజుపేట గ్రామాల నుంచి వెళ్లేందుకు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయా గ్రామాల విద్యార్థులకు బడి బస్సు వేయాలని ఇటీవల మంత్రి లోకేష్కు సామాజిక కార్యకర్త రిక్కీ అప్పారావు ఉండవల్లి ప్రజాదర్బార్లో వినతి పత్రం అందించారు. ఇందులో భాగంగా బస్సును వెళ్లేందుకు రూట్ సర్వే చేశారు. చిన్న చిన్న లోపాలు సరిచేయాలని ఆర్టిసి యాజమాన్యం కోరగా అందుకు స్పందించిన గ్రామ పెద్ద బుద్ధ అప్పలనాయుడు, కృష్ణ స్పందించి ఏ లోపం ఉన్న తాము బస్సుకి ఇబ్బంది లేకుండా సరిచేస్తామని యాజమాన్యానికి తెలిపారు. ఈ పరిశీలనలో ఆర్టిసి డిపో మేనేజర్ కె.రమేష్, ట్రాఫిక్ సూపర్వైజర్ కె.సన్నిబాబు, మండల పంచాయతీ విస్తరణ అధికారి ఉమా, మండల విద్యాశాఖ అధికారి పి.బాల భాస్కరరావు, మెకానిక్ జి.సత్యనారాయణ, ఆర్హెచ్సి సత్యనారాయణ పాల్గొన్నారు.


రూట్ను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

మహారాజశ్రీ రాజాం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి దివ్య సముఖమునకు
IP. 6/2020

పిటీషనర్:-
లావేటి మురళీధర్
రెస్పాండంట్లు :-
బండారి సురేష్ వగైరాలు
To,
పొన్నాడ సంతోష్ కుమార్,(R-5)
S/o అప్పారావు. సా॥ కొట్టాం గ్రామం,
జామి మండలం,విజయ నగరం జిల్లా

పై నెంబర్ పిటీషనులో పిటీషనర్, రెస్పాండెంట్లుపై అనగా మీపైన మరి కొంతమంది పైన IP పై కోర్టులో దాఖలు చేయగా, సదరు IPలో మీ హాజరు నిమిత్తం **తే 09-08-2024 దిన వాయిదా అయి ఉన్నది.** సదరు వాయిదా నాడు పై కోర్టులో మీరు గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీ యెక్క ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు IP పిటిషన్ తీర్మాణించబడును.

// BY COURT ORDER //
డోల కిరణ్బాబు
న్యాయవాది,
రాజాం, సెల్: 919866197313